క్లుప్తంగా

కసాపురంలో ధన్వంతరి హోమం



హోమం నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో గురువారం ధన్వంతరి హోమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆలయ యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవ మూర్తిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రజలు రోగాల బారిన పడకుండా, ఆరోగ్యంతో ఉండాలని కోరుకుంటూ ధన్వంతరి హోమం నిర్వహించారు.

'సేవ్ ఆర్డీటీ' పాదయాత్ర జయప్రదం చేయండి'

పామిడి: కర్నూలు జిల్లా సరిహద్దు నుంచి అనంతపురం వరకూ వంద కిలోమీటర్ల మేర సేవ్ ఆర్డీటీపై ఈనెల 5 నుంచి 8వ తేదీ వరకూ నిర్వహిస్తున్న మహా పాదయాత్రను జయప్రదం చేయాలని ప్రజా ఉద్యమనేత, గజరాంపల్లి వాసి సాకే గోవిందు గురువారం తెలిపారు. 5వ తేదీ ఉదయం 8 గంటలకు కర్నూలు జిల్లా పరిసర ప్రాంతం నుంచి ప్రారంభమయ్యే పాదయాత్రలో ఆర్డీటీ అభిమానులు, ప్రజాసంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనాలన్నారు. 8వ తేదీ పాదయాత్ర కలెక్టరేట్ చేరుకుని సేవ్ ఆర్డీటీకి సంబంధించి ఎఫ్‌సీఆర్ఏ మంజూరుకు పెద్దఎత్తున గళం విప్పాలన్నారు.

పరామర్శ



వివరాలు తెలుసుకుంటున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

బుక్కరాయసముద్రం: వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ ఎంపీపీ చెన్నంపల్లి గువ్వల రాజశేఖర్‌రెడ్డిని గురువారం తాడిపత్రి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి ఎమ్మెల్యే పెద్దారెడ్డి పరామర్శించారు. కొంత కాలంగా అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ డిస్‌చార్జి అయి చెన్నంపల్లిలోని ఇంట్లో విశ్రాంతి తీసుకుండగా మాజీ ఎమ్మెల్యే వెళ్లి ఆరోగ్య స్థితిగతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాజశేఖర్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు పెద్ద వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మద్యం బార్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకోండి

గుత్తి: గుత్తి మున్సిపాలిటీలో నూతన బార్ ఏర్పాటు కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ సీఐ ఉమాదేవి సూచించారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. బార్ ఏర్పాటుకు ఉన్నతాధికారులు రీ నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఈ నెల 14 సాయంత్రంలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 15న అనంతపురంలో లాటరీ ఉంటుందన్నారు. ఇతర వివరాలకు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలన్నారు.

జన సురక్ష పథకాలపై అవగాహన



కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

తాడిపత్రిటౌన్: మండలంలోని భోగసముద్రంలో గురువారం ఆర్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో జనసురక్ష పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆర్‌బీఐ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్ మహానా మాట్లాడుతూ గ్రామీణుల ఆర్థిక, సామాజిక భద్రతకు జన సురక్ష పథకాలు ఉపయోగపడుతాయన్నారు. అనంతరం ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి బీమా యోజన, అటల్ జన్‌ధన్ యోజన్ వంటి పథకాలపై అవగాహన కల్పించి గ్రామస్తులతో నమోదు చేయించారు. అలాగే రీ కేవైసీ (రీ-నో యువర్ కస్టమర్) ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఆర్‌బీఐ జోనల్ (తిరుపతి) హెచ్.శ్రీనివాసకుమార పాత్రి, జితేంద్రకుమార్ మిశ్రా, నరేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

గుత్తి: పట్టణంలోని ఎస్సీ కాలనీలో రమేష్ అనే వ్యక్తి గురువారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ కలహాల కారణంగా అతడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అతడిని అనంతపురం రెఫర్ చేశారు. సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

పొంచి ఉన్న ప్రమాదం



దిమ్మగుడి వద్ద ప్రమాదకరంగా రహదారి

పెద్దవడుగూరు: మండలంలోని దిమ్మగుడి గ్రామం వద్ద ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పొలాల్లో నుంచి వచ్చే వర్షపు నీరు ప్రధాన రహదారి ప్రక్కన ఉన్న కాలువ ద్వారా వెళ్ళే క్రమంలో దారి పక్కన ఉన్న వాలు భాగం కోతకు గురైంది. ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోకపోవడంతో వాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిని గమనించిన స్థానికులు ప్రమాద స్థలం వద్ద రాళ్లు ఏర్పాటు చేశారు. అధికారులు స్పందించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయడంతో పాటు రహదారి మరమత్తు పనులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ప్రహరీ మరమ్మతులు చేయరూ..



క్రీడా మైదానం ప్రహరీ దెబ్బతిన్న దృశ్యం

పుట్లూరు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం ప్రహరీ మరమ్మతులకు గురవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పుట్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఈ క్రీడా మైదానంలో నిత్యం విద్యార్థులు వివిధ క్రీడలను అభ్యసిస్తుంటారు. అయితే ప్రహరీ దెబ్బతినడంతో పశువులు, పందులు, ఇతర మూగజీవాలు క్రీడా మైదానంలోకి వస్తుండడంతో మైదానం అపరిశుభ్రంగా మారడంతోపాటు విద్యార్థులను గాయపరుస్తున్నాయి. ప్రహరీకి వినియోగించిన బండలు పగిలిపోవడంతో సమస్య ఏర్పడింది. అధికారులు స్పందించి క్రీడామైదానం ప్రహరీకి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.

సస్య రక్షణతో అధిక దిగుబడులు



గుంతకల్లు మండలం గొల్లలదొడ్డిలో మిర్చిపంటను పరిశీలిస్తున్న దృశ్యం



పుట్లూరులో పంట నమోదును పరిశీలిస్తున్న ఏఓ కాత్యాయని

గుంతకల్లు రూరల్: మేలైన సస్యరక్షణ చర్యలు పాటిస్తే మిర్చి సాగులో అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త మాధవి సూచించారు. హార్టికల్చర్ ఆఫీసర్ మిత్రవింద మాధవి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉద్యాన శాఖలో అమలవుతున్న సంక్షేమ పథకాల వివరాలను రైతులకు వివరించారు. అదేవిధంగా మిరప సాగులో ఎదురయ్యే సమస్యలు, పంటను ఆశించే చీడ పురుగులు, తెగుళ్ల వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల అవగాహన కల్పించారు.

పంటల నమోదులో అలసత్వం వహిస్తే చర్యలు

పుట్లూరు: ఖరీఫ్ పంటల సాగు నమోదులో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ అధికారి కాత్యాయని హెచ్చరించారు. గురువారం ఆమె పుట్లూరు రెవెన్యూ పరిధిలో చేపట్టిన ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. రైతులు సాగు చేసిన పంటల వివరాలను రైతు సేవా కేంద్రంలోని సిబ్బంది ద్వారా నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వీహెచ్ఏ రవితేజా, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజానికి దిక్సూచి గురువులు



గుంతకల్లులో మాట్లాడుతున్న కళాశాల డైరెక్టర్ గోపాల్



పెద్దవడుగూరులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లు: గురువులు సమాజానికి దిశ, దశ చూపే దిక్సూచి అని వక్తలు అన్నారు. గురువారం స్థానిక శ్రీ శంకరనంద గిరిస్వామి డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ ఆర్.సురేష్‌బాబు మాట్లాడుతూ సమాజానికి శాస్త్రవేత్తలు, మేధావులు, సంఘ సంస్కర్తలను అందించిన ఘనత ఉపాధ్యాయులకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు టీ.వెంకటరమణ, బి.కృష్ణయ్య, డాక్టర్ వరప్రసాద్, డాక్టర్ ఆమీర్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు: మండలంలోని పి.వీరన్నపల్లి జెడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయులను గురువారం ఘనంగా సన్మానించారు.. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం, విద్యాభివృద్ధి కోసం కృషి చేస్తున్న ఉపాధ్యాయులను సన్మానించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక



వై.కె.ఎల్.రంగమ్మ



ఎ. ప్రభావతి



ఈ.మాధవి



ఎస్.ఆర్. రోజామణి



ఎం.జయరాములు

శింగనమల/గుంతకల్లు: జిల్లా ఉత్తమ స్థాయి అవార్డులకు శింగనమల మండలంకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. అలాగే గుంతకల్లులో ముగ్గురు ఎంపికయ్యారు. శింగమనల మండలంలోని వెస్ట్ నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్.ఆర్. రోజామణి ఇంగ్లిషు టీచర్‌గా పని చేస్తూ అవార్డుకు ఎంపికయ్యారు. అలాగే మండలంలోని ఆకులేడు జిల్లా పరిషత్ ఉన్నత పాటశాలలో ఎస్జీ టీచర్‌గా పని చేస్తున్న ఎం.జయరాముడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. అదేవిధంగా గుంతకల్లు మండలంలోని నెలకొండలోని ఎంపీపీ స్కూల్‌లో పనిచేస్తున్న ఎస్‌జీటీ వైకేఎల్ రంగమ్మ, పాతకొత్తచెరువు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలోని బయాలజీ టీచర్ ఎ.ప్రభావతి, అదే స్కూల్‌కు చెందిన పీఈటీ ఈ. మాధవి జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. వారిని సహ ఉపాధ్యాయులు, బంధువులు అభినందించారు.

సాయం ఓ బాధ్యతగా ..



విద్యార్థులకు బహుమతులందజేస్తున్న ఉపాధ్యాయుడు రాచుమల్ల శివరామిరెడ్డి (ఫైల్)

తాడిపత్రిటౌన్: తాడిపత్రి మండలం పెద్ద పోలమడ జెడ్పీ ఉన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయుడు రాచుమల్ల శివరామిరెడ్డి సాయం చేయడం బాధ్యతగా స్వీకరించారు. దాదాపు 8 సంవత్సరాలుగా అదే పాఠశాలలో విధులు నిర్వహిస్తూ విద్యార్థుకు ఆర్థిక సాయం చేస్తూనే పాఠశాల అభివృద్ధికి తన వంతు సాయం చేస్తున్నారు. ఇప్పటి వరకు పాఠశాలలో పలు నిర్మాణాలకు, ఆర్డీటీ ఆధ్వర్యంలో చేపట్టే అదనపు తరగతి గదులకు ఆర్థికసాయం అందజేశారు. అలాగే ఏటా 10వతరగతి విద్యార్థులకు పరీక్షల సామగ్రి అందజేస్తున్నారు. విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు సొంత ఖర్చుతో ప్రతి ఏటా రూ.3 వేలతో స్వాతంత్ర, ఘనతంత్ర, బాలల దినోత్సవం రోజుల్లో బహుమతులందజేస్తారు. పాఠశాలకు తోటి ఉపాధ్యాయులతో కలసి ఇన్‌వర్టర్, డ్రిల్‌కు కావల్సిన స్పీకర్లు అందజేశారు. అలాగే పాఠశాలలో స్వీపర్‌గా పని చేస్తున్న నాగరాజు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న సమయంలో రూ.15వేలు ఆర్థిక సాయం అందజేశారు. గ్రీనరీ ఏర్పాటుకు పాఠశాల ఆవరణలో కొబ్బరి మొక్కలు నాటారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం



పామిడిలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రామలక్ష్మి



పెద్దవడుగూరులో పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

పామిడి: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని గుత్తి ఐసీడీఎస్ శాఖ సూపర్‌వైజర్ రామలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక టీసీ హైస్కూల్‌లో గుత్తి ఐసీడీఎస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్య వివాహాల నిర్మూలన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 18 సంవత్సరాల్లోపు కిశోర బాలికలు పెళ్లి చేసుకోరాదన్నారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. అనంతరం బాల్య వివాహాల వల్ల జరిగే అనర్థాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో పీడీ రామకృష్ణ, అంగన్‌వాడీ కార్యకర్తలు జయంతి, అనిత, మహిళా సంరక్షక కార్యదర్శి శ్రీలక్ష్మి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణే లక్ష్యంగా ముందుకు సాగాలి

పెద్దవడుగూరు: బాలల పరిరక్షణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని జిల్లా బాలల పరిరక్షణ సిబ్బంది రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి సూచించారు. గురువారం మండలంలోని క్రిష్టిపాడు ప్రభుత్వ పాఠశాలలో బాలల పరిరక్షణ, బాలల చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు బాలలపై జరుగుతున్న దాడులను వివరించారు. విద్యాహక్కు చట్టాలను గురించి, విద్య ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మహిళా పోలీసు దివ్య, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగరాణి, ఉమాదేవి, అనంతలక్ష్మి రమాదేవి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీ వేడుకలకు ముస్తాబు



మెయిన్‌రోడ్డులో ఏర్పాటు చేసిన స్వాగత తోరణాలు



జెండాలను కొనుగోలు చేస్తున్న ముస్లింలు

గుంతకల్లుటౌన్: ముస్లింల ఆరాధ్య దైవం మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని భక్తిశ్రద్ధలతో నిర్వహించుకునే మిలాద్ ఉన్ నబీ వేడుకలకు గుంతకల్లు ముస్తాబైంది. పట్టణంలోని మసీదులతో పాటు మదీనా ఆర్చ్ తదితర ప్రార్థనా మందిరాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. మెయిన్‌రోడ్డుతో పాటు ప్రధాన వీధుల్లో మక్కా, మదీనా నమూనాలతో స్వాగత తోరణాలు, భారీ హోర్డింగ్‌లను ఏర్పాటు చేశారు. మిలాద్ ఉన్ నబీ పండుగ రోజున పట్టణంలో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించనున్న నేపథ్యంలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపడుతున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా మిలాద్ ఉన్ నబీ సందర్భంగా గురువారం పట్టణంలోని చాలా వీధుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి వందలాది మందికి అన్నదానం చేశారు.

రైల్వేలో ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు



యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్‌ను పరిశీలిస్తున్న డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా

గుంతకల్లు: రైల్వేలో ప్రమాదాల నివారణకు అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా ఆదేశించారు. స్థానిక కోచింగ్ డిపోలోని యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్ (ఏఆర్‌టీ)ను గురువారం ఆయన తనిఖీ చేశారు. పరికరాలను పరిశీలించారు. అనుకోని రైలు ప్రమాదం ఎదురైనప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందితో చర్చించారు. ముఖ్యంగా స్టేఫీ పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అవసరమైన అన్ని సహకారాలు అందిస్తామన్నారు. మెకానికల్, ఇంజినీరింగ్, సిగ్నలింగ్, ఎలక్ట్రికల్, స్టేఫీ విభాగాలకు చెందిన ఉద్యోగులు అప్రమత్తంగా వ్యహరించడంతో పాటు సమష్టిగా రాణిస్తూ ప్రమాదాలను నివారిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీనియర్ డీఓఎం శ్రావణ్‌కుమార్, సీనియర్ డీఎంఈ మణికుమార్, సీనియర్ డీఈఈ శ్రీనివాసులు, ఆయా విభాగాల అధికారులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో 'గుమ్మనూరు'ను తరిమికొడతారు



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గద్దల నాగభూషణం

గుత్తి: వచ్చే ఎన్నికల్లో ప్రజలు గుమ్మనూరు జయరామ్‌ను తరిమికొడతారని వక్తలు అన్నారు. రెండు రోజుల క్రితం గుత్తి మండలం బేతాపల్లిలో సోలార్ ప్లాంట్‌ను పరిశీలించడానికి వెళ్లిన ఏపీ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డిని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం దుర్భాషలాడిన వైనాన్ని రౌండ్ టేబుల్ సమావేశంలో అందరూ ఖండించారు. గుత్తిలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో గురువారం సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, ప్రజా సంఘాలు, రైతు సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గద్దల నాగభూషణం, కౌలు రైతు జిల్లా కార్యదర్శి బాల రంగయ్య, సీపీఐ మండల కార్యదర్శి రామదాసు, కేవీ పీఎస్ మండల అధ్యక్షుడు మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు రమేష్, బీఎస్పీ వెంకట కొండయ్య తదితరులు మాట్లాడారు. ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఇష్టానుసారం మాట్లాడితే సహించే ప్రసక్తే లేదన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు తరమికొడతారన్నారు. వెంటనే ఆయన క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మరోసారి ఇలా మాట్లాడితే ఎమ్మెల్యే ఇంటిని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు మహుముదా, సీపీఐ పట్టణ కార్యదర్శి రాజు, ఐద్వా నాయకురాలు రేణుకమ్మ, డీవైఎఫ్ఐ అధ్యక్షులు అశోక్, ఆటో యూనియన్ నాయకులు నజీర్ తదితరులు పాల్గొన్నారు.

యూరియాపై విజిలెన్స్ తనిఖీలు



గుత్తిలో ఫర్టిలైజర్స్ గోదామును పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

అనంతపురం అగ్రికల్చర్/గుత్తి: యూరియా అంశంపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయశాఖ సంయుక్త తనిఖీలు గురువారమూ కొనసాగాయి. ఉమ్మడి జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ వైబీపీటీఏ ప్రసాద్ ఆదేశాల మేరకు డీఎస్పీ ఎం.నాగభూషణం, ఎస్ఐ నరేంద్రభూపతి, వ్యవసాయ అధికారి జె.వాసుప్రకాష్, గుత్తి ఏడీఏ ఎం.వెంకటరాముడు, ఏఓ ముస్తాక్, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఏడు దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. మూడు దుకాణాల్లో భౌతిక నిలువలు, ఈ-పాస్ మిషన్ నిల్వల మధ్య వ్యత్యాసాలు ఉన్నట్లు గుర్తించారు. చట్టప్రకారం రూ.15 లక్షల విలువ చేసే 15.90 మెట్రిక్ టన్నులు ఎరువుల అమ్మకాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ నోటీసులు జారీ చేశారు. యూరియాకు సంబంధించి కృత్రిమ కొరత సృష్టించినా, నో స్టాక్ బోర్డులు పెట్టడం లాంటివి చేస్తే చట్టప్రకారం చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు



వై.వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే

గుంతకల్లుటౌన్: నియోజకవర్గంలోని ముస్లింలకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త వై.వెంకటరామిరెడ్డి మిలాద్ ఉన్ నబీ శుభాకాంక్షలు తెలిపారు. ప్రేమ, సహనం, శాంతి, సామరస్యాలను బోధించిన మహమ్మద్ ప్రవక్త జన్మదినం సందర్భంగా జరుపుకునే మిలాద్ ఉన్ నబీ అందరికీ సంతోషాన్ని అందించాలని కోరుకుంటున్నట్లు వైవీఆర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

రక్తదాన శిబిరం



రక్తదాతకు సర్టిఫికెట్లను అందజేస్తున్న ఏఎస్పీ

తాడిపత్రి రూరల్: పట్టణంలోని సిద్ధిబాషా దర్గా సమీపంలో గురువారం ఫ్రెండ్స్ సహార సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. మిలాద్ ఉన్ నబీ పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఏఎస్పీ రోహిత్‌కుమార్ రక్తదానం చేశారు. అనంతపురం ప్రభుత్వాస్పత్రి బ్లడ్ బ్యాంకు వారు 91మంది నుంచి రక్తాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు కరీముల్లా, అలీ, సోహైల్, అజీమ్, ఖాజా తదితరులు పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల పట్టివేత



గార్లదిన్నె పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచిన ఇసుక టిప్పర్లు

శింగనమల: మండలంలోని తరిమెల పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను గురువారం మైనింగ్ అధికారులు పట్టుకున్నారు. టిప్పర్లకు పర్మిట్లు లేకపోవడంతో సీజ్ చేసి, గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మైనింగ్ అధికారులు కేసు నమోదు చేశారు.

మరదలితో అసభ్య ప్రవర్తన .. కేసు నమోదు

యల్లనూరు: మండలంలోని కూచివారిపల్లికి చెందిన పి.ఆంజనేయులు భార్య పత్తిపాటి శ్రీలతపై వరుసకు బావ అయిన పత్తిపాటి సుబ్బరాయుడు అస్యభ్యంగా ప్రవర్తించాడు. భర్త చనిపోవడంతో శ్రీలత తమకున్న పొలంలో వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. ఈ క్రమంలో తాను సాగు చేసిన మొక్కజొన్న పొలానికి బుధవారం వెళ్లిన ఆమె ఒంటరిగా ఉండడం గమనించిన సుబ్బరాముడు చెయ్యి పట్టుకుని లాగి ప్రవర్తించాడు. అక్కడే ఉన్న ఆయన కుమారుడు సైతం ఆమె చెంపపై కొట్టి అవమానించాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా రాగిణి



తాడిపత్రి రూరల్: తాడిపత్రి మార్కెట్ యార్డు చైర్‌పర్సన్‌గా భూమా రాగిణిని నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయని అధికారులు గురువారం తెలిపారు. తాడిపత్రి మార్కెట్ యార్డుకు మొట్టమొదటి మహిళా చైర్‌పర్సన్‌గా ఆర్యవైశ్య కులానికి చెందిన రాగిణి ఎంపికపై పలువురు అభినందించారు.

దళితులపై దాడి తగదు

విడపనకల్లు: దళితులపై దాడి చేయడం తగదని ఎస్సీ,ఎస్టీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉలిగన్నను సాకే హరి,దొడ్డప్ప, నరేంద్ర, మారెన్న పరామర్శించారు. సాకే హరి మాట్లాడుతూ మూడు రోజుల క్రితం విడపనకల్లులో ఉలిగన్నపై అదే గ్రామానికి చెందిన బీసీ వర్గానికి చెందిన వారు మూకుమ్మడిగా దాడి చేశారన్నారు. మూడు రోజులవుతున్నా ఇంత వరకూ దాడి చేసిన వారిని అరెస్టు చేయకుండా, కేసు నమోదు చేయకుండా నిర్లక్ష్యం చేయడం సరి కాదన్నారు.